స్వామివారి సన్నిధిలో సరస్వతీ పూజలు



చాగల్లు తెలగా సంఘం వినాయకుని గుడి వద్ద సరస్వతీ పూజలు చేస్తున్న విద్యార్థులు



నిడదవోలు 9వ వార్డులో సరస్వతీ పూజలు చేస్తున్న విద్యార్థులు

- చదువులో రాణించాలంటూ వేడుకోలు
- పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసిన నిర్వాహకులు
- కొనసాగుతున్న గణపతి నవరాత్రులు

చాగల్లు: స్థానిక తెలగా సంఘం విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం భారీ ఎత్తున సరస్వతీ పూజలు నిర్వహించారు. విద్యార్థులు చదువులో రాణించాలనే ఉద్దేశంతో విద్యార్థుల ఆధ్వర్యంలో చదువుల తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుడు లింగాల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ఘనంగా ఈ కార్యక్రమాలు జరిగాయి. దాతల సహకారంతో పూజల్లో పాల్గొన్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకుడు గంగ్రోతు సురేంద్రకుమార్, వైఎస్సార్ సీపీ మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, తెలగా సంఘం పెద్దలు పాల్గొన్నారు. అలాగే చాగల్లు వర్తక సంఘం వినాయకుడి ఆలయం వద్ద కూడా సరస్వతీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఉత్సవ కమిటీ నిర్వాహకులు గ్రంధి రాంబాబు పర్యవేక్షించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా చాగల్లులో శనివారం రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. గంగ్రోతు కృష్ణారావు కల్చరల్ ఆడిటోరియంలో తెలగా సంఘం ఆధ్వర్యంలో మోహన్ ఆర్కెస్ట్రా వారి సినీ మ్యూజికల్ నైట్ జరిగింది. బృంద సభ్యులు మధుర గీతాలు, కొత్త పాటలు ఆలపించి అలరించారు. భారీగా ప్రేక్షకులను హాజరయ్యారు. వర్తక సంఘం కళావేదికపై ప్రదర్శించిన ఇంద్రజాలం, స్పెషల్ డాల్ డ్యాన్స్ షో, మిమిక్రీ చిన్నారులను బాగా అకట్టుకున్నాయి.

ఘనంగా నిమజ్జనాలు

చాగల్లు, ఊనగట్ల గ్రామాల్లో ఆదివారం వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలను వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మణగూడెంలోని బాల గణపతిని డప్పు వాయిద్యాలతో ఊరేగించి, నిడదవోలు కాలువలో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు, యువకులు పాల్గొన్నారు. చిక్కాల, నెలటూరులలో బుట్టబొమ్మలు, డప్పు వాయిద్యాలతో స్వామి వారిని గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేశారు. బ్రాహ్మణగూడెంలోని నడి వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద ఆదివారం సాయంత్రం అన్న సమారాధన నిర్వహించారు.అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిడదవోలులో పట్టణంలో..

నిడదవోలు: పట్టణంలోని యాదవుల వీధిలో 9వ గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం గణనాథుని సన్నిధిలో చిన్నారులు, విద్యార్థులు సరస్వతీ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, గోపీ యాదవ్, గుడ్ల సతీష్, ఘంటా సావిత్రి, కట్టా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు మండలంలో..

నిడదవోలు రూరల్: ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణపతి విగ్రహాల నిమజ్జనోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల వాహనాలపై భారీ వినాయకుల ప్రతిమలను ఊరేగింపులు నిర్వహించి జలాశయాల్లో నిమజ్జనం చేశారు. నిడదవోలు మండలంలోని తాడిమళ్ల, సమిశ్రగూడెం, డి.ముప్పవరం గ్రామాల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బుట్టబొమ్మలు, తీన్‌మార్ డప్పులు, యువకుల నృత్యాలతో పల్లెలు గణేష్ నిమజ్జనాలతో సందడిగా మారాయి. తాడిమళ్లలో విచిత్ర వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు.

పలుచోట్ల అన్న సమారాధనలు

ఉండ్రాజవరం: వినాయక చవితిని పురస్కరించుకుని ఉండ్రాజవరం మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం అన్న సమారాధనలు నిర్వహించారు. సూర్యారావుపాలెంలో కమ్మ యువజన సంఘం ఆధ్వర్యంలో 3,000 మందికి, చివటం గ్రామంలో గౌడ సేవా సమితి ఆధ్వర్యంలో 2,000 మందికి, కె.సావరంలో లలితా నగర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 3,000 మందికి అన్నదానం చేశారు. అలాగే ఉండ్రాజవరంలోని వరసిద్ధి వినాయకుడి ఆలయం వద్ద సుమారు 4,000 మందికి వివిధ రకాల పిండి వంటలతో అన్న సమారాధన చేశారు.



నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామంలో విచిత్ర వేషధారణలతో చిన్నారులు



చాగల్లు వర్తక సంఘం వినాయకుని గుడి వద్ద సరస్వతీ పూజలు చేస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

పశ్చిమ డెల్టాకు 7,000 క్యూసెక్కులు

నిడదవోలు: రైతుల సాగు అవసరాల మేరకు పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల్లోని మూడు డెల్టాలకు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. నీటి పారుదల శాఖ ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు డెల్టా కాలువలకు నీటి విడుదలను ఆదివారం పెంచారు. పశ్చిమ డెల్టాకు 7000, మధ్య డెల్టాకు 2,200, తూర్పు డెల్టాకు 4700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 900, తణుకు కాలువకు 667, అత్తిలి కాలువకు 539, నరసాపురం కాలువకు 1888, ఉండి కాలువకు 1244 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నల్లజర్లలో కంటి వైద్యశిబిరం



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న నిపుణుడు

నల్లజర్ల: భగవాన్ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నల్లజర్లలోని నల్లూరి వెంకటపతి ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద ఆసుపత్రి కంటి వైద్యనిపుణులు 80 మందికి పరీక్షలు చేశారు. వారిలో 22 మందికి ఆపరేషన్లు చేయాలని 16 మందికి కళ్ళజోళ్లు వేయించుకోవాలని వైద్యులు వెల్లడించారు. గుర్తించిన 22 మందికీ వేమగిరిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్టు సత్యసాయి సేవా సంస్థల మండల కన్వీనర్ శివ రామారావు తెలిపారు.

మాజీ సర్పంచ్ బూరయ్య మృతి

నిడదవోలు రూరల్: మండలంలోని పందలపర్రు పంచాయతీ మాజీ సర్పంచ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, టీడీపీ నాయకుడు భోగిరెడ్డి సత్యనారాయణ (బూరయ్య) (78) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బూరయ్య పార్థివ దేహానికి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ నాయకులు, పార్టీ శ్రేణులు బూరయ్య మృతికి సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గృహసారథులకు బీమాపై అవగాహన



వైఎస్సార్ బీమాపై వివరిస్తున్న గృహసారథుల మండల కన్వీనర్ సత్యనారాయణ

గోపాలపురం: వైఎస్సార్ బీమా సదుపాయాన్ని గృహ సారథులు సద్వినియోగం చేసుకోవాలని గృహసారథుల మండల కన్వీనర్ తానింకి సత్యనారాయణ సూచించారు. వైఎస్సార్ బీమా పథకంపై గృహ సారథులకు ఆదివారం అవగాహన కల్పించారు. మండలంలోని వాదాలకుంట గ్రామ సచివాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన గృహ సారథులకు ఉచిత బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని గృహసారథులకు సూచించారు. వాదాలకుంట సర్పంచ్ జొన్నకూటి మణెమ్మ, గృహసారథులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరానికి నూతన సీఐలు



వీరయ్య, త్రీ టౌన్



పుల్లారావు, వన్ టౌన్

కంబాలచెరువు: స్థానిక త్రీ టౌన్, వన్ టౌన్ పట్టణ లాండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు జి.మధుబాబు, ఎస్.లక్ష్మణరావును ఏలూరు రేంజ్ వీఆర్‌కు తరలించారు. ఈ మేరకు ఆదివారం పోలీసు శాఖ నుంచి ఉత్వర్వులు వెలువడ్డాయి. అలాగే వీఆర్‌లో వి.పుల్లారావును వన్‌టౌన్‌కు, ఎస్‌పీ.వీరయ్యను త్రీటౌన్‌కు సీఐలుగా బదిలీ చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే తలారి జన్మదిన వేడుకలు



దేవరపల్లిలోని క్యాంపు కార్యాలయం వద్ద 175 అడుగుల భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ఎమ్మెల్యే తలారి వెంకట్రావును 30 అడుగుల గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు

- 175 కిలోల కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే తలారి
- 30 అడుగుల గజమాలతో సత్కరించి వైఎస్సార్ సీపీ నాయకులు
- జన సంద్రమైన క్యాంపు కార్యాలయం

దేవరపల్లి: గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు జన్మదిన వేడుకలు దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వోద్యోగులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే తలారి విజ్ఞప్తి మేరకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురానికి చెందిన బన్ను యూత్ ఏర్పాటు చేసిన 175 కిలోల కేక్‌ను ఎమ్మెల్యే తలారి కట్ చేశారు. 30 అడుగల గజమాలతో బన్ను యూత్ సభ్యులు, పార్టీ మండల నాయకులు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పరంజ్యోతి దంపతులను అభినందించారు. క్రేన్ ద్వారా గజమాలను తీసుకు వచ్చి ఎమ్మెల్యే దంపతులకు అలంకరణ చేశారు. క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు పార్టీ నాయకులు, అభిమానం రక్తదానం చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్యే వెంకట్రావు ప్రారంభించారు. తన జన్మదినోత్సవం సందర్భంగా గోపాలపురం మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా ఇళ్ల స్థలాల పట్టాలను రెవెన్యూ అధికారులు అందజేశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే వెంకట్రావు కృతజ్ఞతలు తెలిపారు. క్యాంపు కార్యాలయం జనంతో కిక్కిరిసింది.

నవంబరు 19న గాండ్ల తెలికుల వన సమారాధన



వన సమారాధన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గాండ్ల తెలికుల రాష్ట్ర నాయకులు

నల్లజర్ల: అఖిల గాండ్ల తెలికుల, దేవ తెలికుల రాష్ట్ర కార్తిక వన సమారాధన నవంబరు 19న రాజమహేంద్రవరంలో జరుగుతుందని ఆ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతం వెల్లడించారు. ఆ సామాజికవర్గ గోపాలపురం నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం దూబచర్లలో జరిగింది. ఈకార్తిక వన సమారాధనకు 26 జిల్లాల నుంచి గాండ్ల తెలికుల, దేవతెలికుల సామాజికవర్గం వారందరూ కుటుంబ సభ్యులతో హాజరు కావాలన్నారు. తమ కులాల డిమాండ్లను ఈ సమారాధనలో ప్రభుత్వానికి తెలియ జెబుతామన్నారు కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను రాష్ట్ర నాయకులు ఆవిష్కరించారు. ఆ సంఘం ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్ నరవ గోపాలకృష్ణ, విద్యాకమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, జామి శ్రీనివాసరావు, చిప్పాడ కుమార్, కెల్లా గణేష్, పొట్నూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- కానూరు అగ్రహారంలో వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: తాగునీటి ఎద్దడి లేని నియోజకవర్గంగా నిడదవోలును అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ప్రకటించారు. అందుకోసం రూ.72 కోట్ల వ్యయంతో ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా మండలంలోని కానూరు అగ్రహారం గ్రామంలో నిర్మించే వాటర్ ట్యాంక్‌కు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.73 లక్షల వ్యయంతో ఈ గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మిస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడారు. అభివృద్ధి విషయంలో నిడదవోలు నియోజకవర్గం ఇప్పటికే జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. జిల్లాలోని ఏ నియోజకవర్గంలో జరగనన్ని పనులు ఈ నియోజకవర్గంలో చేపట్టామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో చేపట్టిన మంచినీటి కుళాయిల పనులు వచ్చే ఏడాదికి పూర్తవుతాయన్నారు. వాటర్ ట్యాంకుల నిర్మాణం వలన రాబోయే 25 ఏళ్ల వరకు గ్రామాలకు తాగునీటి ఎద్దడి ఉండదన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో రూ. 2 కోట్ల నుంచి రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ దాసం వెంకన్న, దాసం బుజ్జి ఎంపీడీఓ దామోదరరావు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడిని సత్కరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పట్టణంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ రీజినల్ సెమినార్

నిడదవోలు: రాష్ట్రంలో ఆర్యవైశ్యుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ రీజినల్ సెమినార్‌ను ఆదివారం పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రసంగించారు. ఆర్య వైశ్యుల వ్యాపారాల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆర్యవైశ్యులలో పేదలకు కూడా ఏబీసీ నేస్తం పథకం కింద ఆర్థిక చేయూత అందిస్తున్నామని చెప్పారు. నిడదవోలు పురపాలక సంఘ పాలకవర్గంలో ఆర్యవైశ్య మహిళలకు సముచిత స్థానం కల్పించామన్నారు. పట్టణంలో వాసవీ క్లబ్ ఆడిటోరియం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం రీజియన్ పరిధిలో సామాజిక సేవలు నిర్వహిస్తున్న వివిధ వాసవీ క్లబ్‌ల ప్రతినిధులను అవార్డులతో సత్కరించారు. వాసవీ క్లబ్ సభ్యులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వాసవీ ఇంటర్నేషనల్ రీజియన్ చైర్మన్ మానేపల్లి వెంకటరమణ, ఇంటర్నేషనల్ మల్టిపుల్ వైస్ ప్రెసిడెంట్ మహంకాళి మురళీధర్, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మడిపల్లి భాస్కరం, ఇంటర్నేషనల్ అదనపు కోశాధికారి నాగసూరి మురళీమోహనరావు, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ ఎన్‌వీటీ సుందర రావు, రీజియన్ సెక్రటరీ చిలకల మల్లికార్జున రావు, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, చిలకల శారదాదేవి, ఆలమూరు భారతి, క్లబ్ ఎక్స్‌టెన్షన్ చైర్మన్ ఆలమూరు రాజశేఖర్, పచ్చిపులుసు బీఎస్ఎన్ మూర్తి, కోటా శివరామకృష్ణ, చెక్క రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మలకపల్లిలో మాల మాస్టీల ప్రదర్శన



మాల మాస్టీలు



బరువులు ఎత్తుతున్న మాల మాస్టీ

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి గ్రామంలో ఆదివారం ప్రదర్శించిన మాల మాస్టీల సాహస విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దళిత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో మలకపల్లి కమ్యూనిటీ హాలు వద్ద ఈ ప్రదర్శన జరిగింది. ముఖ్యంగా మాల మాస్టీలు బరువులు ఎత్తడం, నిప్పుల ప్రదర్శన, ఒంటిపై పెట్టుకుని రాళ్లు పగల గొట్టడం వంటి సాహసాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొవ్వూరులో మోస్తరు వర్షం

కొవ్వూరు: పట్టణంలో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఔరంగాబాద్, వాడపల్లిలలో గంట పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది.వర్షానికి పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.వాతావరణ శాఖ రెండు రోజులపాటు వర్ష సూచన చేసింది. ఆదివారం ఉదయం నుంచి చెదురుమదురుగా చినుకులు పడుతూనే ఉన్నాయి.

రావూరుపాడులో 108 ప్రసాదాలతో మహా నివేదన

తాళ్లపూడి: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలోని రావూరుపాడులో ఆదివారం స్వామివారికి 108 ప్రసాదాలతో మహా నివేదన చేశారు. షణ్ముఖ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని రామాలయం వెనుక గణనాథుని మండపాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులు తమ ఇంటి వద్ద నుంచి ఒక్కో ప్రసాదాన్ని స్వయంగా తయారు చేసి తీసుకుని వచ్చి బొజ్జ గణపయ్యకు సమర్పించారు. అర్చకుడు నాగేశ్వర శర్మ చేతుల మీదుగా ప్రసాదాలకు పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, యూత్, మహిళలు పాల్గొన్నారు.

కొవ్వూరు మెరక వీధిలో..

కొవ్వూరు: పట్టణంలోని మెరక వీధి వాటర్ ట్యాంక్ జంక్షన్ వద్ద రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మండపంలోని వినాయకునికి ఆదివారం 108 రకాల వంటకాలతో మహా నైవేద్యం సమర్పించారు. వివిధ రకాల పండ్లు, పిండి వంటకాలతో స్వామి వారికి నైవేద్యం సమర్పించారు.అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆవుల వాసు, అత్తిలి పండు, ముత్యాల సాయి పాల్గొన్నారు.



కొవ్వూరు మెరక వీధి వినాయకునికి 108 రకాల వంటకాలతో నైవేద్యం



రావూరుపాడులో వినాయకునికి 108 ప్రసాదాల మహా నివేదన

